క్లుప్తంగా

బత్తల ఇంటికి బైరెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులతో బైరెడ్డి సిద్దార్థరెడ్డి

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో ఉన్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బత్తల హరిప్రసాద్ నివాసానికి గురువారం ఆ పార్టీ యువజన విభాగంరాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దారెడ్డి విచ్చేశారు. బత్తల హరిప్రసాద్ తండ్రి, మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను అత్యధిక మెజారిటితో గెలిపించాలని బైరెడ్డి అందరినీ కోరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్రభాస్కర్‌రెడ్డి, కదిరి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగప్రసాద్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

తాడిమర్రి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రధానంగా గర్భిణులకు పండంటి బిడ్డలు జన్మిస్తారని వైద్యాధికారిణి హరిత పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆమె గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

అనాథకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు, పంచాయతీ కార్మికులు

బత్తలపల్లి: మాల్యవంతం సమీపంలోని కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్ద ఆరు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన సుంకన్న మృతదేహానికి గురువారం బత్తలపల్లి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం రాత్రి మృతి చెందడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం మృతదేహాన్ని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. ఎవరూ రాకపోవడంతో ఎస్‌ఐ శ్రీనివాసులు ఆదేశాల మేరకు పంచాయతీ కార్మికులు, పోలీసులు అనాథ మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి, కానిస్టేబుల్ జనార్దన్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి ప్రతిభ



జ్యోతిప్రసాద్‌నాయక్

ముదిగుబ్బ: గుడ్డంపల్లి తండాకు చెందిన గిరిజన విద్యార్థి జ్యోతి ప్రసాద్‌నాయక్ జేఈఈ మెయిన్స్‌లో 2821వ ర్యాంకు సాధించినట్లు విద్యార్థి తల్లిదండ్రులు మురళీనాయక్, సుజాతాబాయి దంపతులు తెలిపారు. ఈ విద్యార్థి పదవ తరగతి ముదిగుబ్బలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదివాడు.

నేడు జేకేపల్లిలో ఎమ్మెల్యే ప్రచారం

ముదిగుబ్బ: జొన్నలకొత్తపల్లిలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు ఇందుకూరి నారాయణరెడ్డి, సీవీ నారాయణరెడ్డి తెలిపారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఖాద్రీశున్ని దర్శించుకున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



ఖాద్రీశుడి సన్నిధిలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని గురువారంవైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఖాద్రీశుని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు రాగానే ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కదిరి ఎన్నికల ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసరెడ్డి, నాయకులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి,గోపాలరెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో నీరాజనం

- కోలాహలంగా మక్బుల్ అహ్మద్ నామినేషన్ దాఖలు
- నియోజకవర్గ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో జనసంద్రం
- కదిరి తిరునాలను తలపించిన నామినేషన్ మహోత్సవం
- హాజరైన బైరెడ్డి సిద్దార్థరెడ్డి, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ



పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్



నామినేషన్‌కు హాజరైన జనసందోహంలో ఓ భాగం

కదిరి: వేలాదిగా తరలివచ్చిన అశేష జనవాహిని, అభిమానుల కేరింతలు, పార్టీ నాయకులు, కార్యకర్తల కోలాహలం నడుమ వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ నామినేషన్ పర్వం గురువారం అట్టహాసంగా సాగింది. కదిరిలో ప్రధాన వీధులన్నీ జనంతో కిక్కిరిసి పోయాయి. జనం అభిమానం ముందు భగభగ మండే సూర్యుడు కూడా చిన్నబోయాడు. ఎటు చూసినా వైఎస్సార్‌సీపీ జెండాలు రెప రెపలాడాయి. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మక్బుల్ నామినేషన్‌కు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అంబేడ్కర్ కూడలి వద్ద క్రేన్ సాయంతో మక్బూల్‌తో పాటు రథంపై ఉన్న ఇతర నాయకులకు గజమాల వేశారు. ముందుగా స్థానిక నానా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థన ల్లో పాల్గొని అనంతరం అక్కడి నుంచి ప్రచార రథంపై బయలుదేరారు. నానా దర్గా నుంచి జీవిమాను సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా వేమారెడ్డి కూడలిని చేరుకోవడానికే సుమారు మూడు గంటలు పైగా సమయం పట్టింది. నామినేషన్ దాఖలు చేయడానికి సమయం ముగుస్తుందనే ఉద్దేశంతో వేమారెడ్డి సర్కిల్‌లో మక్బూల్‌తో పాటు కొందరు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచార రథం దిగి కారులో ఆర్డీఓ కార్యాలయం చేరుకున్నారు. దీంతో నిర్దేశించిన గడువు లోగా ఆయన తన నామినేషన్ దాఖలు చేశారు.

కదిరిలో హ్యాట్రిక్ ఖాయం

నామినేషన్ కార్యాక్రమానికి వచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటే కదిరిలో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్దారెడ్డి పేర్కొన్నారు. జనం నుంచి దూరమైన పార్టీలతో చంద్రబాబు గుంపుగా వస్తుంటే జగనన్న సింహంలా సింగిల్‌గా పోటీ చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజలతోనే పొత్తు పెట్టుకుంటుందని తెలిపారు. కులం,మతం, పార్టీలను కూడా చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపు పేదలుంటే, ప్రతిపక్ష నేత చంద్రబాబు వైపు పెత్తందారులున్నారన్నారు. అబద్ధపు హామీలతో చంద్రబాబు ప్రజల ముందుకొస్తున్నారని, ఆయన పాలన ఎలా ఉందో గతంలో మనం చూశామని, .ఇప్పుడు జగన్ పాలననూ చూస్తున్నామన్నారు. బాబు దొంగ హామీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. బీజేపీ, జనసేనతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నప్పటికీ ఆ మూడు పార్టీల తరఫున టీడీపీ నాయకులే పోటీ చేస్తున్నామని గుర్తు చేశారు. ఒకవేళ చంద్రబాబు అధికారంలోకి వస్తే జగనన్న ప్రవేశపెట్టిన పథకాలన్నీ ఆగిపోతాయని ఆయన తెలియజేశారు. చంద్రబాబు తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లినా అక్కడ కూడా అందమైన బడి..పైన ఫ్యాను కనబడతాయని గుర్తు చేశారు.

సామాన్య మహిళలకు ఎంపీ టికెట్ ఇచ్చారు

తాను ఒక సామాన్య బోయ జాతికి చెందిన మహిళనని, తనను గుర్తించి జగనన్న ఎంపీ టికెట్ ఇవ్వడం తనతో పాటు పేదలందరికీ గర్వకారణమని వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి బి.శాంతమ్మ పేర్కొన్నారు. చంద్రబాబు గతంలో మాట్లాడిన మాటలకు, ఇప్పుడు మాట్లాడుతున్న దానికి ఎక్కడా పొంతన లేదన్నారు. చంద్రబాబు మాటలకు విశ్వసనీయ లేదని చెప్పారు. ఎన్నికల సమయంలో బాబు ఇచ్చే హామీలు గతంలో ఏ మేరకు అమలు చేశారో ప్రజలందరికీ తెలుసని, అందుకే జనమంతా మళ్లీ జగనే రావాలని కోరుకుంటున్నారన్నారు. అందుకు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ జనమే సాక్ష్యమన్నారు.

పోలింగ్‌రోజు రెట్టింపు ఉత్సాహంతో పని చేద్దాం

వైఎస్సార్‌సీపీకి కదిరి కంచుకోట అని, పిలవగానే స్వచ్ఛందంగా ఇంత పెద్ద ఎత్తున తన నామినేషన్‌కు తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ పేర్కొన్నారు. మే 13న జరగనున్న పోలింగ్ రోజు ప్రతి కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పని చేసి ప్రతి పోలింగ్ బూత్‌లో మనకు మంచి మెజార్టీ వచ్చేందుకు కృషి చేయాలన్నారు. భవిష్యత్‌లో తాను ప్రతి కార్యకర్తను తన గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని, వారికి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. వైఎస్సార్‌సీపీ కదిరి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అత్తార్ చాంద్‌బాషా, డాక్టర్ కడపల మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, మాజీ సమన్వయకర్త ఇస్మాయిల్, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు బత్తల హరిప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సాదిక్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ వేమల ఫర్హానా ఫయాజ్, సాదత్ అలీ, కౌన్సిలర్లు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



ర్యాలీగా వస్తున్న ముస్లిం మహిళలు



నృత్యం చేస్తున్న లంబాడీ మహిళలు



ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న మక్బూల్ అహ్మద్

కదిరిలో హ్యాట్రిక్ విజయం ఖాయం



తనకల్లు నుంచి నామినేషన్‌కు వెళుతున్న నాయకులు

తనకల్లు: కదిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయం ఖాయమని ఆ పార్టీ మండల నాయకులు అన్నారు. కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ నామినేషన్ కార్యక్రమానికి గురువారం మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నేత ఎంజీ రెడ్డి, మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులునాయుడు, భక్తవత్సలరెడ్డి, బైక్ భాస్కర్‌రెడ్డి, బీఎస్ తబ్రేజ్, సంజీవురెడ్డి దేశాయి, కొండా మల్లికార్జున, అశోక్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, నీలకంఠారెడ్డి, బీఎస్ నిజాం,వినోద్, సమరసింహారెడ్డి, మహబూబ్‌పీరా, గోపాల్, రఫీ, తబ్రేజ్, రామ్‌దేశాయ్, భాస్కర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, సిద్దారెడ్డి, బాబా, రహంతుల్లా, పవన్‌కుమార్, చాంద్‌బాషా, మాధవరెడ్డి, శంకర్‌రెడ్డి, హేమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ అహ్మద్ నామినేషన్ కార్యక్రమానికి గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధ్వర్యంలో మండల నలుమూలల తరలివెళ్లారు.

నామినేషన్‌కు తరలిన నాయకులు

ఎన్‌పీకుంట: కదిరిలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ నామినేషన్‌కు మండలం నుంచి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. సుమారు 100 వాహనాలలో మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, బాలక్రిష్ణనాయుడు, షామీర్‌బాషా, సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, యువపారిశ్రామికవేత్త ఎం.హరీష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి ల ఆధ్వర్యంలో కదిరికి బయలుదేరారు. వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, సర్పంచులు, వివిధ శాఖల కన్వీనర్లు, డైరెక్టర్లు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

తొమ్మిది నామినేషన్లు దాఖలు

ధర్మవరం అర్బన్: ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో గురువారం తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా రవీంద్రరెడ్డి, మాచిరెడ్డిగారి ఈశ్వర్‌రెడ్డి, ధనుంజయ, ఇలియాజ్ అహ్మద్, వినయ్‌కుమార్, శ్రీరాములు నాయక్, బిల్లే నరేంద్ర, బీరే సోమశేఖర్, బీజేపీ తరఫున అంబటి సతీష్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు.

నిత్యం అందుబాటులో ఉండాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న గ్రంథాలయ కార్యదర్శి రమా

పరిగి: పాఠకులకు గ్రంథాలయాల వల్ల మెరుగైన జ్ఞానం అందుతుందని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమా తెలిపారు. మండలంలోని కొడిగెనహళ్లి గ్రంథాలయాన్ని ఆమె గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి లక్ష్మీప్రసన్నతో పలు రికార్డులపై ఆరా తీశారు. భద్రపరిచిన పుస్తకాలు, మెయింటెనెన్స్, పాఠకుల రిజిష్టర్ తదితర వాటిని తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలకు, విద్యార్థులకు ముఖ్యంగా పోటీ పరీక్షలకు హజరయ్యే యువతకు మంచి జ్ఞానాన్ని అందించే పుస్తకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

మలేరియాను నిర్మూలిద్దాం



ఆత్మకూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



కనగానపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కనగానపల్లి: దోమల ద్వారా వ్యాపించే మలేరియాను పూర్తిగా నిర్మూలించుకోవాలని కనగానపల్లి పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, ధనమ్మ, ఎల్‌టీ హరి, స్టాఫ్‌నర్సు భవానీ, సీహెచ్‌ఓలు హరిక్రిష్ణ, ఎంఎన్ రాజు, సుకన్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రతి ఒక్కరు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా సూచించారు. గురువారం మండలం కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. తొలుత వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. మలేరియా జ్వరం చలి, వణుకు, కూడిన తలనొప్పితో వస్తుందని తెలియజేశారు. ముఖ్యంగా విష జ్వరాలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి ముందు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మురుగు నీరు నిల్వ ఉంచరాదని.. ఇళ్లలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచితే లార్వా చేరి జ్వరాలు సోకే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం ఆశావర్కర్లు, ఏఎన్‌ఎమ్‌ల ద్వారా నీటి తొట్టెలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

తలుపుల: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వైద్యాధికారి అఫ్తాబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద నుంచి మెయిన్ రోడ్డు, స్థానిక మూడు రోడ్ల కూడలి వరకు వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజులు మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా దోమలను నివారించవచ్చన్నారు. మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ మహబుబ్ బాషా పాల్గొన్నారు.

దోమల నివారణతో రోగాలు దూరం



తాడిమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ధర్మవరం రూరల్: దోమల నివారణతో రోగాలు దూరమవుతాయని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. గొట్లూరు గ్రామంలో గురువారం మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పుష్పలత దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్‌రెడ్డి, జైతూన్‌బీ, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి: పరిసరాల పరిశుభ్రతతో మలేరియా నివారణ సాధ్యమని సాధ్యమని ఎంపీడీఓ మణి మంజిరి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యాధికారి హరిత ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీకి ఆమె హాజరయ్యారు. వైద్యాధికారిణి హరిత దోమలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఆమె గ్రామస్తులకు సూచించారు. సీహెచ్‌ఓ హేమలత, పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, ఎంపీహెచ్‌ఈఓ నారాయణమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్ రామ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మలకవేముల క్రాస్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం డాక్టర్ నాగేంద్ర నాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌ఎన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఎస్‌ఎస్ రవి శంకర్, సీహెచ్‌ఓ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: మలేరియా రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2030 నాటికి దోమలులేని దేశంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్యులు నజీర్, సురేష్, శ్రావణి, శ్వేత, ప్రియాంక, సిబ్బందిపాల్గొన్నారు.

రోగులకు మందుల పంపిణీ



మందులు పంపిణీ చేస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేట షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం శ్రీ సత్య సాయి భజన మండలి సభ్యులు రోగులు, ప్రజలకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు.

సజావుగా ఏపీఆర్‌జేసీ పరీక్ష

ధర్మవరం అర్బన్: పట్టణంలో గురువారం ఏపీఆర్‌జేసీ పరీక్షలు సజావుగా జరిగాయి. పరీక్షా కేంద్రాలను డీఈఓ మీనాక్షి పరిశీలించారు. ఏపీఆర్‌జేసీ, డీసీ సెట్ పరీక్షలకు 1734 మందికిగాను 1558 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే 5,6,7,8 తరగతుల కోసం విద్యార్థులు 1303 మంది దరఖాస్తు చేసుకోగా 1134 మంది పరీక్షకు హాజరయ్యారు. తనిఖీల్లో డీఈఓ మీనాక్షితోపాటు రూట్ ఆఫీసర్ రాజేశ్వరిదేవి, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావులు ఉన్నారు.

నేడు ఎర్రబల్లిలో దుద్దుకుంట ప్రచారం

కొత్తచెరువు: మండలంలోని ఎర్రబల్లి గ్రామంలో శుక్రవారం పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారేపల్లి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గుడిసెలు దగ్ధం



మంటల్లో కాలిపోతున్న గుడిసెలు

కదిరి అర్బన్: కే. బత్తలపల్లిలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదం మూడు గుడిసెలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఉదయం రామస్వామి, శ్రీనివాసులు, ఉత్తప్ప చెందిన గుడిసెలు మంటల్లో చిక్కుకున్నాయి. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పేశారు. అయితే అప్పటికే ఇళ్లలో సామగ్రి మొత్తం కాలిపోయింది.

వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

తాడిమర్రి: ఆత్మకూరు ఎస్సీ కాలనీలో టీడీపీకి చెందిన 15 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. సర్పంచ్ శెట్టిపల్లి వెంకటనారాయణరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్, ఉప సర్పంచ్ అల్లే సాయినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సాకే రాము, సాకే రాజమ్మ, సాకే లక్ష్మయ్య, సాకే పార్వతమ్మ, సాకే పెద్దక్క, సాకే పెద్దన్న, సాకే పెద్దవీరయ్య, సాకే రమాదేవి, సాకే సంజమ్మ, సాకే వీరయ్య, సాకే అంకప్ప, సాకే రామకృష్ణ, సాకే శ్రీరాములు తదితర కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు అశ్వర్థరెడ్డి, ఓబిరెడ్డి, సుబ్బయ్య, చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

రేపు పాలిసెట్ పరీక్ష

ధర్మవరం అర్బన్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం పాలిసెట్ పరీక్షను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కోఆర్డినేటర్ సురేష్ బాబు గురువారం తెలిపారు. పట్టణంలో కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, గుట్టకిందపల్లి కేహెచ్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తారకరామాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కొత్తపేట ఉషోదయ స్కూల్, సంజయ్‌నగర్ బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, సుందరయ్యనగర్ గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్షలు ఉంటుందన్నారు. ఉదయం 10గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

కదిరిఅర్బన్: ఈ నెల 27న జరిగే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పాలిసెట్ కోఆర్డినేటర్ ఎం నారాయణ తెలిపారు. గురువారం పాలిసెట్ ఏర్పాట్లపై ఆయన కదిరి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. పట్టణంలో ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేమన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఎంజేఎల్ డిగ్రీ కళాశాల, జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9590312443 నంబరులో సంప్రదించాలని కోరారు.

శక్తి మహిళా సంఘం సర్వసభ్య సమావేశం

ధర్మవరం రూరల్: పోతుకుంట ఆర్‌డీటీ కార్యాలయంలో గురువారం శక్తి మైత్రి మహిళా సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముదిగుబ్బ, కనగానపల్లి, రామగిరి, ధర్మవరం డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు అందరూ కలిసి కమిటీని ఏర్పాటు చేశారు. సీబీఓ ప్రెసిడెంట్‌గా బాలినేని మీనా, సెక్రటరీగా శశికళ, కోశాధికారిగా ముత్యాలమ్మలను ఎన్నుకున్నారు.శక్తి మైత్రి మహిళా సంఘం ఏపీఎస్ఏసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ధర్మవరం నుంచి ప్రమీలను ఎంపిక చేశారు.

సందడిగా ఉట్ల పరుష



ఉట్ల మాను ఎక్కుతున్న యువకులు

పెనుకొండ: పట్టణంలో గురువారం సాయంత్రం వజ్రాల పేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉట్ల పరుష వేడుకలు సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా యువకులు పెద్ద ఎత్తున ఉట్ల మానును ఎక్కే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని తిలకించడానికి ప్రజలు భారీగా తరలివచ్చారు.